క్లుప్తంగా

సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న స్టాఫ్‌నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ

విజయనగరం ఫోర్ట్: స్టాఫ్‌నర్సుల సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని స్టాఫ్‌నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం జరిగిన స్టాఫ్‌నర్సుల సమావేశంలో ఆమె పాల్గొని, కాసేపు మాట్లాడారు. మనమంతా ఐక్యంగా ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘ కార్యదర్శి కోటమ్మ, జిల్లా కార్యదర్శి భీమేష్, కోశాధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు ప్రణాళిక సిబ్బంది పలు ప్రాంతాల్లో అక్రమంగా కట్టిన నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. కేఎల్ పురం, సుందరయ్య కాలనీ, బౌడార రోడ్డు, రింగ్ రోడ్డు ప్రాంతాల్లో రహదారిని ఆక్రమించి చేస్తున్న చేపల విక్రయ దుకాణాలను ఇప్పటికే ఖాళీ చేయించగా, ఎక్కడైనా ఇంకేమైనా అక్రమ కట్టడాలు ఉన్నాయేమో చూస్తున్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



వృద్ధురాలి కళ్లు తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

నెల్లిమర్ల: నగరపంచాయతీలోని థామస్‌పేటలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 15వ వార్డు కౌన్సిలర్ కల్యాణం సత్యనారాయణ, థామస్‌పేట యూత్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విజయనగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది రోగులకు సేవలందించారు. ప్రతి ఒక్కరి కళ్లను క్షుణ్నంగా తనిఖీ చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి పుష్పగిరి కంటి ఆస్పత్రిలోనే ఉచితంగా ఆపరేషన్ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పెట్రోలు బంకుల్లో ఆకస్మిక తనిఖీలు



కలెక్టరేట్ కూడలిలోని పెట్రోలు బంకులో తనిఖీలు చేస్తున్న అధికారులు

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రంలోని పెట్రోలు బంకుల్లో అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పెట్రోలు, డీజిలు నిల్వలు, రికార్డులతో పాటు బంకు వద్ద భద్రతా చర్యలు, నీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.మధుసూదనరావు, ఐవోసీఎల్ సేల్స్ ఆఫీసర్ పీవీ శివకుమార్, బీపీసీఎల్ సేల్స్ ఆఫీసర్స్ అన్విత, లీగల్ మెట్రాలజీ ఏసీ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాల బారినపడొద్దు



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ మూర్తి

విజయనగరం అర్బన్: విద్యార్థులు, యువత చెడు వ్యసనాల బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ప్రముఖ సైకాలజిస్ట్ మూర్తి అన్నారు. మండల పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సైకాలజీ ఆఫ్ అడిక్షన్ అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి ఎంతోమంది యువత చెడు అలవాట్లకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మనసును నియంత్రించుకోగలిగితే వాటి నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. శరీరం కన్నా మనసే వ్యసనాన్ని కోరుకుంటుందని, అదే ఒత్తిడి చేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డీవీ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాండ్‌లిచ్చి బుకాయించడమే సుపరిపాలనా?

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి



దక్కిన వీధిలో జరిగిన సభలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల

విజయనగరం: ఎన్నికల హామీలను కచ్చితంగా అమలు చేస్తామని ప్రజలను నమ్మించేందుకు బాండ్‌లిచ్చి, ఇప్పుడు అవేవీ అమలు చేయకుండా బుకాయించడమేనా సుపరిపాలన అని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి మండిపడ్డారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్‌లో మంగళవారం పర్యటించిన ఆయనకు ఆ ప్రాంత ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కార్పొరేటర్ బవిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన పాల్గొని, కూటమి మోసపూరిత పాలనపై ధ్వజమెత్తారు. అబద్ధాలు, మోసాలతోనే చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారని, కూటమి అధికారంలోకి వచ్చి 13 నెలల కాలం దాటినా ఏ ఒక్క ఎన్నికల హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అధికారం చేపట్టిన ఏడాదికే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేయడం జరిగిందని గుర్తు



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల, నాయకులు

చేశారు. ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఇచ్చిన పథకాల కన్నా ఎక్కువ ఇస్తామని, ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో సంక్షేమ లబ్ధి చేకూరుస్తామని ప్రజలను బాగా నమ్మించారని, తీరా గద్దెనెక్కిన తర్వాత పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తే పూటకో మాట మారుస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ బాధ్యత గల ప్రతిపక్ష పాత్ర పోషించడం వల్లే జనానికి ఆ రెండు పథకాలు(గ్యాస్, తల్లికి వందనం) అయినా ఇచ్చారన్నారు. వాటిల్లో కూడా మోసమే ఉందన్నారు. తాజాగా మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ నిధి డబ్బులు ఎప్పుడిస్తారన్న మాటకు అది ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాల్సిందేనని అనడం సిగ్గుచేటన్నారు.

మిగతా పథకాలేవీ?

ఎన్నికల ప్రచారంలో ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అన్నారని, కానీ మూడు సిలిండర్లే ఇస్తున్నారని..కొంతమందికి గ్యాస్ డబ్బులు కూడా పడలేదన్నారు. తల్లికి వందనం కింద అప్పుడు ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని ఇప్పుడు రూ.13 వేలు ఇస్తున్నారని అది కూడా కొంతమందికేనని దుయ్యబట్టారు. చాలామంది తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు రూ.10 వేలు మాత్రమే పడ్డాయన్నారు. ఇంకా మహిళలకు ఉచిత బస్సు, నెలకు రూ.1500, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. మీలా(కూటమి నాయకులు) ప్రజలను మోసం చేస్తే జగన్‌మోహన్‌రెడ్డి కూడా మరోసారి ముఖ్యమంత్రి అయ్యేవారని, ఆయన ఎప్పుడైనా చెప్పిందే చేస్తారని, చేయగలిగిందే చెప్తారన్నారు. ఇప్పటికే గ్రామాల్లో వైఎస్సార్ సీపీ పాలనకు కూటమి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనిస్తుండడం ప్రారంభమైందన్నారు. సభలో పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టివీరవెంకట రాజేష్, ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, యువజన విభాగం ఇన్‌చార్జ్ జి.ఈశ్వర్‌కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



విలేకరుల సమావేశంలో కూటమి కుతంత్రాలపై మండిపడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్, నగర అధ్యక్షుడు ఆశపు వేణు

విజయనగరం: రాష్ట్రంలో లోకేష్ రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ఎక్కడ చూసినా ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులే తప్ప ప్రజలకు చేసిన మంచి లేదని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్, నగర అధ్యక్షుడు ఆశపు వేణులు విమర్శించారు. ఇదే విషయమై వారు నగరంలోని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గతంలో వైఎస్సార్ సీపీ హయాంలో జరగని మద్యం కుంభకోణం జరిగిందని చెప్పి కావాలనే కక్షపూరితంగా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయించారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ లేకుండా చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు మూడు రోజులకే వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు ఎగబడ్డారని, రాష్ట్రంలో రక్తపాతం సృష్టించారన్నారు. ఇప్పుడు అక్రమ కేసులు బనాయించి, ప్రతిపక్ష పార్టీ నాయకులను వేధిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని అక్రమ అరెస్ట్‌లు చేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అక్రమాలపై ప్రశ్నిస్తే చాలు లేనిపోని కేసులు పెట్టి, జైలులో పెట్టిస్తున్నారని ఇలా చేయడం రాజ్యాంగ వ్యతిరేకం కాదా అని నిలదీశారు. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికేనా ప్రజలు మీకు అధికారం ఇచ్చారని ధ్వజమెత్తారు. ప్రజలంతా గమనిస్తున్నారని వారే రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హితవుపలికారు. ఇప్పటికైనా ప్రజలకు మంచి చేసేలా పాలన చేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటరాజు, ఎన్ని లక్ష్మణరావు, జీవీ రంగారావు, బండారు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి ప్రజా ఉద్యమానికి తీరనిలోటు



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు, సభ్యులు

నెల్లిమర్ల: ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతి ప్రజా ఉద్యమానికి తీరనిలోటని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు అన్నారు. స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద విద్యుత్ హమాలీల సంఘం ఆధ్వర్యంలో అచ్యుతానందన్ మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అచ్యుతానందన్ 17 ఏళ్ల ప్రాయంలోనే కమ్యూనిస్ట్ పార్టీలో చేరి భూస్వాముల చేతిలో దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కార్మికులకు అండగా నిలిచారని గుర్తుచేశారు. అలాగే భారత్ కమ్యూనిస్ట్ పార్టీ(మార్క్సిస్ట్)ఏర్పాటుకు కృషి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అంతేకాకుండా 1980 నుంచి 1991 వరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి సీపీఎంను ప్రజల్లోకి తీసుకువెళ్లి మరింత బలోపేతం చేశారన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేరళ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని కొనియాడారు. నిరాడంబరమైన జీవన శైలి, నిబద్ధత కలిగిన ఆయన కేరళ రాజకీయాల్లో చెరగని ముద్రవేశారన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పి.లక్ష్మణరావు, కె.గోవిందరావు, పి.పెదరాంబాబు, చినరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం గంటస్తంభం: నగరంలోని సీపీఎం కార్యాలయంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ మంగళవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు, సీపీఎం సీనియర్ నాయకులు ఎం.శ్రీనివాస్,వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం గంటస్తంభం: స్థానిక ఎల్‌బీజీ నగర్‌లో కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ మంగళవారం సభ నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ తదితరులు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జి.పుణ్యవతి, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారార్భాటం తప్ప పథకాలేవీ?

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో కూటమి తీరుపై మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ ధ్వజం



కృష్ణాపురం సభలో కూటమి కుతంత్రాలను ఎండగడుతున్న నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పక్కనే మాజీ ఎంపీ బెల్లాన

పూసపాటిరేగ: కూటమి ప్రభుత్వానికి, ఆ నాయకులకు ప్రచార ఆర్భాటం తప్ప రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం గూర్చి పట్టించుకునే ఆలోచన లేదని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కనిమెల్ల, అల్లాడపాలెం, కనిమెట్ట, కందివలస, చింతపల్లి, కృష్ణాపురం, గోవిందపురం గ్రామాల్లో మంగళవారం పర్యటించిన సదరు నేతలకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. కూటమి మోసాలను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లిన వారికి మహిళలు సాదర స్వాగతం పలుకుతూ వారి నుదుటన తిలకం దిద్ది, హారతులిచ్చి సంతోషం వ్యక్తం చేశారు. అలాగే కూటమి ప్రభుత్వంలో పడుతున్న ఇబ్బందులను వారితో పంచుకున్నారు. అధైర్యపడొద్దని మళ్లీ మన ప్రభుత్వమే వస్తుందని భరోసానిచ్చారు. ఆ తర్వాత ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండలు పాల్గొని, కూటమి కుతంత్రాలు, కుయుక్త రాజకీయాలపై మండిపడ్డారు. పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా అశాంతి నెలకొందన్నారు. ప్రభుత్వ మోసాలను ప్రశ్నించే వారిపై దాడులు, అక్రమ కేసులు, అరెస్ట్‌లతో రాష్ట్రంలో భయానక వాతావరణం ఏర్పరుస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారించకుండా కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రజలకు వారిచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటివరకు ఏ ఒక్క పథకమూ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఇప్పటివరకు ఇచ్చిన ఒకట్రెండు పథకాల్లోనూ మోసమే దాగి ఉందన్నారు. ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఇప్పుడు మూడు మాత్రమే ఇస్తుండడం మోసం కాదా అని ప్రశ్నించారు. అలాగే తల్లికి వందనం పథకం కింద ప్రతి తల్లికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఒకరికి రూ.13 వేలు, మరొకరికి రూ.10 వేలు ఇలా విచిత్రంగా డబ్బులు వేయడం నయవంచన కాదా అని నిలదీశారు.

కూటమిదీ అదే తీరు.. ఆ నాయకులదీ అదే తీరు..

ప్రజలను మోసం చేయడంలో కూటమిది అదే తీరు.. ఆ నాయకులదీ అదే తీరన్నారు. స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి.. ఆమె గెలిచిన వంద రోజుల్లో వంద కంపెనీలు తెచ్చి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని.. ఇంతవరకు ఎంతమందికి ఉద్యోగాలిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధిలో పదేళ్ల ముందుకువెళ్తే..చంద్రబాబు ఏడాది పాలనలో రాష్ట్రంలో ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. ఎన్నికల సమయంలో చాలా హామీలిచ్చారని, వాటిని అమలు చేయకుండా వాటి వైపు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మీరు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌ని అందరూ గమనిస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 18 ఏళ్ల వయసు నిండిన ప్రతిబిడ్డకు నెలకు రూ.1500, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇలాంటి పథకాలు అమలు చేయాల్సినవి ఎన్నో ఉన్నాయని అవెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల హామీలు అమలు చేసేంతవరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. మీరిచ్చిన ప్రతి హామీ అమలు చేయాల్సిందేనన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు పి.అప్పలనాయుడు, జి.సన్యాసినాయుడు, జెడ్పీటీసీ వైకుంఠం, వైస్ ఎంపీపీలు ఎస్.సత్యనారాయణరాజు, ఎస్.రమేష్, ప్రజాప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, ఎం.జనార్దనరావు, ఎం.శ్రీనివాసరావు, బి.చినఅప్పన్న, ఎం.నాగబాబు పాల్గొన్నారు.



సభకు హాజరైన ప్రజలు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకర్లు

నెల్లిమర్ల: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని పలువురు బ్యాంకర్లు సూచించారు. మండల కేంద్రంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సత్యనారాయణ, ఏపీజీవీబీ మేనేజర్ శ్రవణ్, డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ మూర్తినాయుడులు హాజరై, అంశాల వారీగా అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే ఇటువంటి కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకుంటే భవిష్యత్ బలంగా ఉంటుందన్నారు. ఆర్థిక అక్షరాస్యత వల్ల కలిగే ప్రయోజనాలు, సైబర్ నేరాల బారినపడకుండా చేపట్టాల్సిన చర్యలను వారు వివరించారు. రిసోర్స్‌పర్సన్లు ఫణికుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలి



సోషల్ ఆడిట్ వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

పూసపాటిరేగ: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం పనుల సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీలు)పై ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. ఆడిట్ సిబ్బంది ఉపాధి పనుల తనిఖీలకు సంబంధించి వివరాలు వెల్లడించగా, పనుల కొలతల్లో తేడాలు, బినామీ మస్తర్లు వంటివి వెలుగుచూశాయి. ఇవన్నీ విన్న తర్వాత ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి..గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల నివారణే లక్ష్యంగా అమలు చేస్తున్న ఉపాధి పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు. మరోసారి ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా చూడాలని, ప్రజల సొమ్ముతో జరిగే పనులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శారదాదేవి, ఎంపీడీవో ఎం.రాధిక, ఏపీవోలు రత్నమాల, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన దారుణం

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విజయనగరం గంటస్తంభం: అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ప్రభుత్వాల పాలన దారుణమని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులకు ప్రజలకు చేసిందేమీ లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ విమర్శించారు. నగరంలోని అమర్‌భవన్‌లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అధ్యక్షతన ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి 14వ మహాసభ మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని మండిపడ్డారు. రైతులు, కార్మికులు ఇలా అన్నివర్గాలకు అన్యాయం జరిగేలా పెట్టుబడిదారులకు లాభం చేకూరేలా విధానాలు తీసుకురావడం జరుగుతోందని ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్రంలోనూ చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదైనా ఇంతవరకు ఎన్నికల హామీలు అమలు చేయలేదన్నారు. ఈ నెల 26, 27వ తేదీల్లో బొబ్బిలిలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కమ్యూనిస్ట్ నాయకుడు, కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ మృతితో పాటు గడిచిన మూడేళ్లలో మరణించిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల మృతి పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, ఎస్.నాగభూషణం, బాయి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

డెంకాడ: వరి పంట పండిస్తున్న వారంతా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సంగీత సూచించారు. మండలంలోని పినతాడివాడ, పెదతాడివాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేరుశనగ, మొక్కజొన్న పండించే రైతులు కూడా ఈ నెల 31వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని, వరి పంటకు ఎకరాకు రూ.200 చెల్లించి పంటల బీమాను ఆగస్టు 15వ తేదీలోగా చేయించుకోవాలని తెలిపారు.

సీపీఐ(ఎంఎల్)కి శంకరరావు గుడ్‌బై



శంకరరావు

విజయనగరం టౌన్: సీపీఐ(ఎంఎల్)కి ఆ పార్టీ నాయకుడు బి.శంకరరావు, మరికొంతమంది గుడ్‌బై చెప్పారు. తామంతా ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వారు ఓ ప్రకటనలో మంగళవారం ప్రకటించారు. పార్టీ అంతర్గత సమస్యలపై జరిగిన చర్చలు, సమావేశాల్లో విజయనగరం జోనల్ కమిటీకి సమాంతరంగా పార్టీ విధానాలకు వ్యతిరేకంగా కార్యాకలాపాలు జరుగుతున్నాయని పార్టీ రాష్ట్ర కమిటీకి అనేక సార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ సరిదిద్దే ప్రయత్నం చేయలేదని శంకరరావు తెలిపారు. 18 ఏళ్ల పాటు ఆ పార్టీ దాని అనుబంధ సంఘాల్లో క్రియాశీలకంగా వ్యవహరించామని తాము చెప్పింది పట్టించుకోకపోవడమే కాకుండా తమను ఎంతగానో ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఇంకెంత మాత్రం పార్టీలో కొనసాగలేనని నిర్ణయించుకుని తన రాజీనామా లేఖను రాష్ట్ర కమిటీకి పంపించడం జరిగిందన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ప్రతి విద్యార్థి గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. విజయనగరం ముడిదాం రోడ్డులో ఇన్‌స్పైర్ స్కూల్ యాజమాన్యం మంగళవారం చేపట్టిన శౌర్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన..సైబర్ నేరాలు, మహిళల భద్రత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఫోన్లకు వచ్చే అనవసరమైన కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఏ ఒక్కరికీ ఓటీపీ చెప్పవద్దన్నారు. అలాగే విద్యార్థినులు బ్యాడ్‌టచ్‌లకు గురైనప్పుడు భద్రత దొరికే చోటుకు వెళ్లిపోవాలని, రక్షణ కల్పించే వ్యక్తులకు ఈ విషయం చెప్పుకోవాలని తెలిపారు. యువత ఫ్యాషన్ మాయలో పడి మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. అలాగే మహిళల భద్రత కోసం కూడా శక్తి యాప్ అందుబాటులో ఉందని, ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో రక్షణ కోసం ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే క్షణంలో పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారన్నారు. అనంతరం రోటరీ క్లబ్ రూపొందించిన శౌర్య వాల్‌పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు.


ఆకట్టుకున్న సంగీత కచేరీ

విజయనగరం జిల్లా కేంద్రంలో పైడితల్లి చదురుగుడి పక్కన ఉన్న ఆధ్యాత్మిక కళావేదిక వద్ద మంగళవారం చేపట్టిన సంగీత కచేరీ ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో కళాకారులు ఆలపించిన భక్తిగీతాలు ఆద్యంతం వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ త్రినాథరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న విద్యుత్ మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, మధుపాడ, బొడ్డపేట, సతివాడ కల్లాలు, వల్లూరు గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

నోట్ పుస్తకాల వితరణ



నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో దాతలు, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పువ్వాడ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నోట్ పుస్తకాలు మంగళవారం వితరణ చేశారు. ఒక్కో విద్యార్థికి మూడేసి పుస్తకాలు చొప్పున మొత్తం 79 మంది విద్యార్థులకు 237 నోట్ పుస్తకాలు అందజేసినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యానందం పాల్గొన్నారు.